
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



5 నంద్యాల

జిల్లా వార్తలు

ఆదివారం 21 ఏప్రిల్ 2024



కుందూ నదిపై కొనసాగుతున్న వంతెన నిర్మాణం




చెప్పారే తప్పా చేసింది ఏదీ..?

- సాక్షాత్తు సీఎం జగన్ ఇచ్చిన హామీలకే దిక్కులేదు
- ఎమ్మెల్యే శిల్పా రవిది కూడా అదే దారి
- నంద్యాల నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన వైసీపీ

నంద్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల ముందు అలివిగాని హామీలు ఇచ్చారు. గెలిచాక వాటిని అమలు చేయడం మరిచారు. జగన్ సీఎం హోదాలో నంద్యాల నియోజకవర్గానికి హామీల వర్షం కురిపించారు. నంద్యాల ఎమ్మెల్యేగా గెలిపిస్తే గత ప్రభుత్వాలు చేయని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి చెప్పుకొచ్చారు. దీంతో నియోజకవర్గంతోపాటు, రాష్ట్రంలో కూడా వైసీపీకి అనుకూలంగా ప్రజలు తమ ఓటును బదలాయించారు. ఇక గెలవగానే అటు సీఎం జగన్ ఇచ్చిన హామీలు, ఇటు ఎమ్మెల్యే శిల్పా రవి చెప్పిన మాటలు అటకెక్కాయి. ఐదేళ్లు గడిచి మళ్లీ ఎన్నికలు వస్తున్నా నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నియోజకవర్గ పరిస్థితి తయారైంది.

కలగానే రింగు రోడ్డు..



ప్రతిపాదిత రింగు రోడ్డు మ్యాప్

2022 ఏప్రిల్ 9న సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి వసతి దీవెన నిధులు విడుదల చేసేందుకు నంద్యాలకు వచ్చారు. ఈ సందర్భంగా నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మరో భారీ హామీ ఇచ్చారు. కల్వకుర్తి - జమ్మలమడుగు జాతీయ రహదారిలో నంద్యాల శివారు ప్రాంతం నుంచి కర్నూలు - కడప నాలుగు వరుసల జాతీయ రహదారి వరకు నాలుగు వరుసల అవుటర్ రింగు రోడ్డు నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. దీంతో ప్రజలు 'ఏమి తమ భాగ్యము' అని మురిసిపోయారు. ఇక సంబంధిత అధికారులు రూ.450 కోట్లతో ప్రతిపాదనలు కూడా పంపించారు. ఇక అంతే.. ఆ తర్వాత ఆ ఊసే లేదు. ఇప్పటి వరకు దీనికి సంబంధించిన భూసేకరణ గానీ, నిధుల మంజూరు గానీ చేయలేదు. సర్వే పనులు మాత్రమే జరగడంతో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

బంగారం లాంటి అవకాశాన్ని చేజార్చి..

నంద్యాల పట్టణంలోని పిల్లలకు మరింత మంచి చదువు అందించేందుకు ఇక్కడ మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే శిల్పా రవి హామీ ఇచ్చారు. మిట్నాల గ్రామ సమీపంలో మోడల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా, పిల్లర్ల స్థాయిని దాటలేదు. దీంతో మోడల్ స్కూల్‌ను క్రాంతినగర్‌లోని ఓ ప్రభుత్వ శాఖకు సంబంధించిన భవనంలో తాత్కాలిక పాఠశాలను నడిపిస్తున్నారు. దాతల సహకారంతో విద్యార్థులకు కావా ల్సిన మౌలిక సదుపాయాలు సమకూర్చారంటే వైసీపీ ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక దీనికి తోడు నంద్యాలకు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. ఎమ్మెల్యే శిల్పా రవి విద్యాలయానికి ఐదెకరాల స్థలం చూపించలేకపోయారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తన నియోజకవర్గానికి కేంద్రీయ విద్యాలయాన్ని తరలించుకుపోయారు.

సీఎం డొల్ల మాటలు..

ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్ 2017 ఆగస్టు 9న నంద్యాల సభలో మాట్లాడారు. నంద్యాలను ఆనుకుని ప్రవహిస్తున్న కుందూ నది వల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఓ మోస్తరు వర్షాలు కురిస్తే నంద్యాల పట్టణం జలమయవుతుందని, తాము అధికారంలోకి వస్తే కుందూ నదితో పాటు చామకాల్వ ఆధునికీకరణ పనులు చేపడతామని, పూడిక తీయడంతో పాటు లైనింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇక ఆ తర్వాత నంద్యాలను వరదలు ముంచెత్తిన సమయంలో సీఎం హోదాలో జగన్ 2019 సెప్టెంబరు 27న స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. చామకాల్వ ఆధునికీకరణ, విస్తరణకు కట్టుబడి ఉన్నామని, పనులు త్వరలోనే చేపడతామని చెప్పారు. ఇక ఆ తర్వాత పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో మరుసటి ఏడాది మళ్లీ కుందూ నదికి వరదలు రావడంతో లోతట్టు ప్రాంతాలైన దళితపేట, ఆంజనేయ స్వామి వీధి, బైటిపేట, తెలుగుపేట, సంగపేట, వీవీ నగర్, నడిగడ్డ, సలీంనగర్, వీసీ కాలనీ, విశ్వనగర్, శ్యామ్ నగర్ ప్రాంతాలు మునిగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్ర వీడకుండా కుందూ నది, చామకాలువ ఆధునికీకరణ విషయాన్ని పూర్తిగా పక్కన పెట్టేసింది. దీని గురించి సీఎం జగన్‌ను నిలదీసే ధైర్యం లేకపోవడంతో ఎమ్మెల్యే శిల్పా రవి మిన్నకుండిపోయారు.

సీఎం జగన్ కంటే ఘనుడు

సీఎం జగన్ మాత్రమే హామీలు ఇస్తే తనను నమ్ముతారో నమ్మరోనన్న ఉద్దేశంతో ఎన్నికలకు ముందు శిల్పా రవి కూడా పలు హామీలతో నియోజకవర్గ ప్రజలను ముంచెత్తాడు. వైద్య చికిత్స కోసం ఎక్కడెక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా నంద్యాల ప్రభుత్వాసుపత్రిలోనే సూపర్ స్పెషాలిటీ స్థాయి వైద్య సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శిల్పా మాటలేమోగాని ఆస్పత్రిలో తక్కువ ధరకు మందులిచ్చే 'జన ఔషధి' దుకాణం కూడా అందుబాటులో లేకుండా పోయింది. ఇది మూతబడి దాదాపు రెండున్నరేళ్లు కావొస్తున్నా ఇప్పటికీ పునః ప్రారంభించే దిశగా ఎమ్మెల్యే చర్యలు తీసుకోలేదు.

- పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు వెలుగోడు రిజర్వాయర్ నుంచి నంద్యాల చిన్న చెరువుకు పైపులైను ఏర్పాటు చేసి శివారు ప్రాంతాలకు మునిసిపల్ నీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. వాస్తవానికి ఈ పథకానికి సంబంధించి గత టీడీపీ ప్రభుత్వం చేపట్టి రూ.450 కోట్ల నిధులను కూడా మంజూరు చేసింది. అయితే అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే శిల్పా కారణంగా ఈ పనుల్లో వేగం లోపించింది. దీంతో పట్టణ ప్రజలకు నీరు లేక అల్లాడిపోతున్నారు. రెండేళ్ల నుంచి పలు కాలనీల్లో రెండ్రోజులకోసారి నీరు అందుతోంది. ఎమ్మెల్యే అసమర్థ చర్యల వల్ల ఈ ఏడు పట్టణ ప్రజలు తీవ్ర దాహార్తితో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కాలనీల్లోని ప్రజలు ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందంటే నంద్యాలలో నీటి ఎద్దడి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నంద్యాలలో పీజీ కళాశాల ఏర్పాటు చేస్తామని, నంద్యాలలోని క్రీడాకారులు ఇబ్బంది పడకుండా స్టేడియం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలకు దిక్కు లేకుండా పోయింది. ఇక ఆటోనగర్‌లో సిమెంటు రహదారులు నిర్మిస్తామని చెప్పి ఇప్పటికీ చేయకపోవడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మెల్యే అనుచరుల దందాలు..

ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత శిల్పా రవి, ఆయన మనుషుల ఆగడాలు నియోజకవర్గంలో ఎక్కువైపోయాయన్న విమర్శలున్నాయి. 167కే జాతీయ రహదారి తన భూముల గుండా పోకుండా అలైన్ మార్పించారన్న విమర్శలు ఎమ్మెల్యే శిల్పా రవిపై ఆరోపణలు ఉన్నాయి. అలైన్‌మెంటు మారిస్తే తమ భూములు పోతాయని కానాల రైతులు అప్పట్లో ఆందోళనలు కూడా చేపట్టారు. నంద్యాలలో ఏర్పాటు చేసే లే అవుట్లలో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం. ఆయన సమీప బంధువులు ఇందులో చక్రం తిప్పుతున్నారని తెలుస్తోంది. ఇందులో తనకు సమీప బంధువైన ఓ ప్రభుత్వోద్యోగి కూడా బాగానే దండుకున్నారని అప్పట్లో ప్రచారం సాగింది. టీడీపీ నాయకుడికి చెందిన రూ.15 కోట్ల భూమిలో వైసీపీ వారు వివాదాలు సృష్టించి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చి తమ పార్టీలో చేర్చుకున్నారు. ఆ తర్వాత సమస్యను పరిష్కరించకుండా ఆ భూమిలో సగం వాటాకు డిమాండ్ చేశారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ నేత బంధువులు కొంతమంది కుందూ నది విస్తరణ పేరిట మట్టిని తవ్వుకుని అమ్ముకుంటున్నారన్న విమర్శలున్నాయి. మునిసిపాలిటీలో కీలక పదవిని వెలగబెడుతున్న ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు పాత పట్టణంలోని ఓ కుటుంబానికి చెందిన రూ.2 కోట్ల విలువైన భూమిని కాజేశాడని సమాచారం. అలాగే ఎమ్మెల్యేకు సన్నిహితంగా ఉండే మరో ఇద్దరు అనుచరులు రాయమల్పూరం, వెంకటేశ్వరపురం, విజయ డెయిరీ వెనుక వైపు ఉన్న భూములను అక్రమంగా పవర్ ఆఫ్ అటార్నీ పొంది విక్రయించి కోట్ల రూపాయలు కూడబెట్టుకున్నారన్న ఆరోపణలున్నాయి.

నియోజకవర్గ సమస్యలు..

నంద్యాల నియోజకవర్గంలో నంద్యాల పట్టణం, రూరల్ ప్రాంతాలతోపాటు గోస్పాడు గ్రామాలు వస్తాయి. శిల్పా రవి ఎమ్మెల్యే అయిన తర్వాత నుంచి నియోజకవర్గంలో సమస్యలు పెరిగిపోయాయి. ముఖ్యంగా పట్టణంలో చెత్త సమస్య పీడిస్తోంది. నంద్యాల శివారులోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన 80 వేల టన్నుల చెత్త పేరుకుపోయింది. చెత్తను శుద్ధి చేసి ఎరువుగా తయారు చేసేందుకు రెండేళ్ల కిందట రూ.5.25 కోట్లతో మునిసిపల్ అధికారులు టెండరు పిలిచి పనులు అప్పగించారు. దీనికి సంబంధించిన పనులు ఎమ్మెల్యే రవి దగ్గరుండి మరీ ప్రారంభించారు. మూడు నెలల్లో చెత్తను మొత్తం తొలగించి సమస్యను పరిష్కరిస్తామని గొప్పలు చెప్పారు. ఈ చెత్త తొలగింపు పూరి కాకవపోవడంతో తరచూ డంపింగ్ యార్డు అగ్ని ప్రమాదానికి గురి అవుతోంది. దీంతో డంపింగ్ యార్డులోని ప్లాస్టిక్ తగలబడటంతో పొగ మేఘాలు కమ్ముకుని పట్టణ ప్రజలను అనారోగ్యం పాలవుతున్నారు. ప్రజ

- నంద్యాల పట్టణాన్ని, ఎన్టీఆర్ నగర్, వైఎస్సార్ నగర్‌కు మధ్యలో ఉన్న కుందూ నదిపై వంతెన నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం రూ.9 కోట్ల నిధులు మంజూరు చేయడమే కాకుండా, కొంతభాగం నిర్మాణాన్ని కూడా చేపట్టారు. శిల్పా రవి ఎమ్మెల్యేగా పదవి చేపట్టాక ఈ నిర్మాణం గురించి పూర్తిగా విస్మరించారు. ఇప్పటికీ ఈ వంతెన పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తున్నపుడు శివారు ప్రాంత ప్రజలు నంద్యాలకు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- గోస్పాడు మండల కేంద్రం గోస్పాడులో గత టీడీపీ ప్రభుత్వం రూ.5.20 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మించింది. ఈ పథకం కింద వైసీపీ నేతల భూములు ఉన్నాయి. పథకం సక్రమంగా సాగితే వీరి పంటలకు ఇబ్బందులు అనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పథకాన్ని నిరుపయోగంగా మార్చారు. ప్రజలకు ఉపయోగపడే మంచి పథకాన్ని పక్కన పెట్టడం వైసీపీ ప్రభుత్వానికి చెల్లిందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- దీనికి తోడు మండలంలోని జిల్లెల నుంచి పసురపాడు వరకు కేసీ కెనాల్ తూము ఏర్పాటు చేయకపోవడంతో పంటలకు నీళ్లు సరిగ్గా అందడం లేదు. దీంతో ఆయకట్టు రైతుల మధ్య తరచూ వివాదాలు చెలరేగుతున్నాయి.
- దీబగుంట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థలం సేకరణ కూడా ఎమ్మెల్యే చేయలేకపోవడంతో ఇక్కడి నిర్మాణం ముందుకు సాగలేదన్న విమర్శలున్నాయి. దీంతో ఇక్కడి ప్రజలు వైద్య కోసం నంద్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి.
- యుళ్లూరులో చేపట్టిన 60 అడుగుల రోడ్డు నిర్మాణం, 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం, సచివాలయ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ కారణంగా ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో పాటు సరైన వైద్యం అందక అవస్థలు పడుతున్నారు.

యుళ్లూరులో అసంపూర్తిగా నిలిచిపోయినా 30 పడకల ఆస్పత్రి భవనం



మూడో రోజు 11 నామినేషన్లు

- బీసీ జనార్దన్‌రెడ్డి, కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి దాఖలు



బనగానపల్లెలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

నంద్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు - 2024కి సంబంధించి జిల్లాలో నామినేషన్లు సాగుతున్నాయి. నామినేషన్లలో భాగంగా మూడో రోజు 11 నామినేషన్లు నమోదయ్యాయి. మూడో రోజు టీడీపీ నుంచి మాత్రమే ముఖ్యమైన నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. నంద్యాల పార్లమెంటుకు టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి తరపున ఆమె వర్గానికి చెందిన ఉషారాణి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ విడివిడిగా నామినేషన్లు వేశారు. డోన్ నుంచి టీడీపీ అభ్యర్థి కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి తరుపున టీడీపీ నాయకులు ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. డోన్‌లో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డికి అందజేశారు. ఇక ఆళ్లగడ్డ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ నుంచి చాకలి పుల్లయ్య, శ్రీశైలం నియోజకవర్గం నుంచి వైసీపీకి చెందిన సింగారెడ్డి శిల్పా కార్తీక్‌రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం నుంచి టీడీపీకి చెందిన కాకరవాడ చిన్న వెంకటస్వామి, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి యుగ తులిసి పార్టీకి చెందిన రమేశ్, జాతీయ చేతివృత్తుల ఐద్య వేదిక పార్టీకి చెందిన గంజి వెంకటేశ్వర్లు, ఆల్ పీపుల్స్ పార్టీకి చెందిన మంజుల సుబ్బరాయుడు, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన ఐజే వెంకటరమణలు నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి రోజు తొమ్మిది, రెండో రోజు ఆరు, మూడో రోజు 11 కలిపి జిల్లాలోని పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 26 నామినేషన్లు దాఖలయ్యాయి.

జల్సాలకు అలవాటుపడి కటకటాలపాలు

- ఎనిమిది చోట్ల యువకుల దొంగతనాలు
- 29 తులాల బంగారం, 3 కిలోల వెండి, రూ.3లక్షల నగదు స్వాధీనం


నంద్యాల క్రైం/కోవెలకుంట్ల ఏప్రిల్ 20: జల్సాలకు అలవాటుపడిన అయిదుగురు యువకులు దొంగలుగా మారి వరుస చోరీలకు పాల్పడుతూ చివరకు కటకటాలపాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేటకు చెందిన నటువ దుష్యంత్, ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లె గ్రామానికి చెందిన చికిరిసోని గురప్ప, సంజామల మండలం రెడ్డిపల్లెకు చెందిన అల్లం శ్రీకాంత్, కోవెలకుంట్ల పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన మనేపాటి ఇజిత్‌కుమార్, కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామానికి చెందిన బత్తుల విజయకాంత్ అనే ఐదుగురు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడేవారు. వీరంతా గత కొంతకాలంగా ఆళ్లగడ్డ సబ్ డివిజన్ కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చోట్ల దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారు. వరుస దొంగతనాలపై నిఘా ఉంచిన పోలీసులు ప్రత్యేక బృందాలను నియమించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ షేక్ షర్ఫుద్దీన్ నేతృత్వంలో కోవెలకుంట్ల సీఐ ఎస్.జయచంద్ర, ఎస్ఐలు వరప్రసాద్, రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పాటై విచారణ చేపట్టారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు నిందితుల కచ్చితమైన ఆచూకీ కనుగొని అరెస్ట్ చేశారు.

నిందితులను అరెస్ట్ చేసి విచారణ చేయగా రెండేళ్లనుంచి మద్యం, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసలై డబ్బుల కోసం కోవెలకుంట్ల పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో పగలు, రాత్రి అన్న తేడా లేకుడా 8 దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్పీ వెల్లడించారు. నిందితులు కోవెలకుంట్లలోని స్కందా ఆర్చ్‌కు సమీపంలో ఉండగా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 29 తులాల బంగారం, 3 కిలోల వెండి, రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటితో పాటు ఒక ద్విచక్ర వాహనం 4 సెల్‌ఫోన్లు, చోరీకి వినియోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరచిన కోవెలకుంట్ల సీఐ ఎస్.జయచంద్ర, ఎస్ఐలు వరప్రసాద్, రాజ్‌కుమార్‌లతోపాటు కానిస్టేబుళ్లు మాలిక్, లియాజ్, అంజనప్ప, హోంగార్డులు బాబు రామయ్య, మహేష్‌లను ఎస్పీ అభినందించారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

రేపు శ్రీశైల క్షేత్రానికి చంద్రబాబు



శ్రీశైలం, ఏప్రిల్ 20: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు దర్శించుకోనున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సాక్షిగణపతి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుని శ్రీశైలంలోని భ్రమరాంబ సదన్ అతిథి గృహానికి చేరుకుంటారు. తరువాత క్షేత్రపరిధిలోని బయలు వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం తిరిగి హైదరాబాద్‌కు చంద్రబాబు వెళ్లనున్నారు.

జిల్లాలో వాన

- పిడుగు పాటుతో వ్యక్తి మృతి
- 25 గొర్రెలు, 3 ఎద్దులు కూడా...
- మహానందిలో నేలకూలిన అరటిచెట్లు

గడివేముల, ఏప్రిల్ 20: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో శుక్రవారం అర్ధరాత్రి మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో గడివేముల మండలంలోని చిందుకూరు గ్రామ శివారులో పిడుగుపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వెల్దుర్తి మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన గొల్ల శేఖర్ (49) గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. చిందుకూరు గ్రామంలో గొర్రెలు మేపుతూ రాత్రి గొర్రెల మంద సమీపంలోనే నిద్రపోయాడు. రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం మొదలవగానే పిడుగు పడటంతో గొల్ల శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇదే మండలంలోని గడిగరేవులలో పిడుగుపాటుకు గురై 25 గొర్రెలు మృతి చెందాయి. ఇదే మండలంలోని గడిగరేవుల గ్రామంలో పిడుగుపాటుకు గురై 25 గొర్రెలు మృతి చెందాయి. దీంతో సుమారు రూ.3.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

వెల్దుర్తి: మండలంలో లింగాలపల్లె గ్రామంలో శనివారం తెల్లవారుజాము సమయంలో పిడుగుపాటుకు గురై పింజరి బాషాకు చెందిన రెండు కాడెద్దులు మృతి చెందాయి. వీటి విలువ సుమారుగా రూ.లక్షన్నర వరకు ఉంటుందని రైతు తెలిపాడు. అలాగే కలగొట్ల గ్రామంలో రైతు కోటకొండ బజారి కాడెద్దులలో ఒకటి పిడుగుపాటుకు గురై మరణించింది. రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

నేలకూలిన అరటిచెట్లు : రూ.40 లక్షల పంట నష్టం

మహానంది: మహానంది మండలంలో శనివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు అరటి చెట్లు నిలువునా నేలకూలాయి. దీనివల్ల రూ.40 లక్షల మేర పంట నష్టం సంభవించింది. మండలంలోని గాజులపల్లి-మహాదేవపురం సమీపంలో రైతులు సాగు చేసిన అరటిపంట దాదాపు 40 ఎకరాల్లో గెలలతో ఉన్న చెట్లు నేలకూలి అపార నష్టం చేకూరింది. తిమ్మాపురం గ్రామంలో 8 ఎకరాల్లో చేతికొచ్చిన అరటిపంట నేలపాలైంది. అలాగే రైతులు జూటూరు పుల్లయ్య, చక్రపాణిలకు చెందిన అరటిపంటకు నష్టం జరిగింది. మరికొద్ది రోజుల్లో తాము పడ్డ కష్టానికి ఫలితం వస్తుందని ఆశతో ఉంటే ప్రకృతి కన్నెర చెయ్యడంతో భారీ నష్టం జరిగిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఈదురుగాలులకు నేలకూలిన అరటిచెట్లు



మాకేం వస్తుంది?



- అభ్యర్థుల ఎదుట అనుచరుల డిమాండ్లు
- తలలు పట్టుకుంటున్న లోకల్స్
- నోట్లు గుమ్మరిస్తున్న నాన్ లోకల్స్



ఎన్నికలంటే నోట్ల పండుగ. ఇలాంటప్పుడే నాలుగు రాళ్లు వెనుకేసుకోవాలని నాయకుల అనుచరులు అనుకుంటారు. ఐదేళ్లుగా వెంట తిరిగి, ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేసే తమకు ఈ హక్కు ఉన్నదని ద్వితీయ శ్రేణి నాయకులు గట్టిగా అనుకుంటారు. అభ్యర్థులు ఎన్నికల్లో గెలిచాక సంపాదించుకునే దాన్ని దృష్టిలో పెట్టుకొని వీళ్ల డిమాండ్లు ఉంటాయి. తమ నాయకుడికే టికెట్ ఇవ్వాలని, లేకుంటే సత్తా చూపిస్తామని ప్రకటనలు చేసిన వాళ్లు ఇప్పుడు ఎన్నికల వల్ల తమకేం వస్తుందని ఆలోచిస్తున్నారు. ప్రచారంలో వెంట రావాలంటే తమకు ఎంతో కొంత ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దీంతో అభ్యర్థులు హైరానా పడుతున్నారు. గెలిచిన తర్వాత మీకే ప్రాధాన్యత ఇస్తామని నచ్చజెబుతున్నా.. అది సరే ఇప్పుడు మా పరిస్థితి ఏంటో చెప్పండని తెగేసి చెబుతున్నారని అభ్యర్థులు అంటున్నారు.

కర్నూలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

● కోట్లు గుమ్మరిస్తున్న నాన్ లోకల్ అభ్యర్థులు:



ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఓ ప్రధాన పార్టీ నాన్ లోకల్ అభ్యర్థులను బరిలోకి దింపింది. వాళ్లు స్థానిక నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి ద్వితీయ శ్రేణి నాయకుడి స్థోమతను బట్టి రూ.లక్షలు గుమ్మరిస్తున్నారు. పశ్చిమ ప్రాంతం నుంచి తొలిసారిగా బరిలో దిగిన ఓ అభ్యర్థి పక్క రాష్ట్రంలో రూ. వందల కోట్లు ప్రభుత్వ సంస్థల్లో రుణాలు తీసుకుని ఎగ్గొట్టి, ఆస్తుల వేలం దాకా వచ్చారు. ఇక్కడ ఎన్నికల్లో బరిలో దిగి ద్వితీయ శ్రేణి నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులను పచ్చనోట్లతో కొంటున్నారనే ప్రచారం జోరుగా ఉంది. నిన్నటి దాకా తమ నాయకుడికి టికెట్ ఇవ్వలేదంటూ అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ పెద్దాయన సన్నిహితులే ఇప్పుడు అభ్యర్థి పచ్చ నోట్ల మాయలో పడి తన నాయకుడి ఇంటి ఛాయలకే వెళ్లడం మానేశారట. మరో రెండు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో సంప్రదాయ రాజకీయాలు చేసే నాయకులకు ఇబ్బందిగా మారింది. పక్క పార్టీ అభ్యర్థి రూ. లక్షలు లెక్క లేకుండా చల్లుతోంటే.. తమకు కనీసం ఖర్చులకైనా ఇవ్వరా అని అభ్యర్థులను ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది.

● పోలింగ్ వరకు ఇబ్బందులు తప్పవా...?



ఓటర్ల మనసు గెలిచి ఓట్లు సంపాదించే కంటే ముందు తమ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలను కాపాడుకోవడం అభ్యర్థులకు తలకు మించిన భారంగా మారింది. టమోటా సాగులో పేరుగాంచిన నియోజకవర్గం నుంచి రెండోసారి బరిలో దిగిన ప్రధాన పార్టీ అభ్యర్థి ఒకరు ప్రత్యర్థి పార్టీలో అసంతృప్త నేతలకు గాలం వేస్తూ.. తమ పార్టీలోకి రాకపోయినా పర్వాలేదు.. పోలింగ్ రోజు సాయం చేయండి చాలు అంటూ రూ.లక్షలు ఆఫర్ చేశారనే ప్రచారం ఉంది. అది తెలిసిన స్వపక్షం పార్టీ గ్రామ స్థాయి నాయకులు ఇన్నాళ్లు మిమ్మల్ని నమ్ముకుని ఉన్నాం.. మాకు ఖర్చులు రెట్టింపయ్యాయి. మాకెంత ఇస్తారు అంటూ తెగేసి చెప్పడంతో ఆ అభ్యర్థి తలలు పట్టుకున్నారని తెలిసింది. గోడ దూకుతారేమో అని అనుమానం ఉన్న కొందరికి డబ్బు ఇచ్చి నిలబెట్టుకున్నట్లు తెలుస్తోంది. మరో నియోజకవర్గంలో ఓ అభ్యర్థి నామినేషన్లు తర్వాత డబ్బు సర్దుబాటు చేస్తానని చెప్పినప్పటికీ.. అడిగింది ఇవ్వకుంటే ప్రత్యర్థి వైపు వెళ్తారన్న భయంతో సదరు అభ్యర్థి ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితి ఏర్పడటంతో.. వారు అడిగినంత కాకున్నా.. ఎంతో కొంత ఇచ్చి బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రెండు మూడు పర్యాయాలు పోటీ చేసిన అభ్యర్థులకు ఇది కొత్తేమి కాకున్నా.. మొదటిసారి బరిలోకి దిగిన వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఓటరు గుర్తింపు కార్డుకు 28 ఏళ్లు

తెలుసుకుందాం



ఓటు వేయడానికి ప్రధాన ఆయుధమైన ఓటరు గుర్తింపుకార్డు అమల్లోకి వచ్చి 28 ఏళ్లు పూర్తవుతోంది. ఎన్నికల్లో పారదర్శకత పెంచేందుకు భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు అమలు చేస్తూనే ఉంది. ఈ మేరకు 1995లో అప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్.శేషన్ ఓటరు గుర్తింపుకార్డులు ప్రవేశ పెట్టారు. అవి అమలులోకి వచ్చి 28 ఏళ్లు అవుతోంది. ఓటరు జాబితా ఆధారంగా పుట్టిన తేదీ, ఫొటో, చిరునామా తదితర వివరాలతో ఎన్నికల కమిషన్ ఓటరు గుర్తింపుకార్డు ముద్రిస్తుంది. ప్రతి కార్డుపై హాలోగ్రామ్ స్టిక్కర్ ఉంటుంది. ఓటరు గుర్తింపు కార్డు ఆధారంగా ఓటు, పోలింగ్ బూత్ వివరాలు ఆన్‌లైన్‌లో సులువుగా తెలుసుకోవచ్చు. ఓటరు గుర్తింపుకార్డు చూపించి ఓటు వేయవచ్చు. బ్యాంకు ఖాతాలు, రుణాలు, డ్రైవింగ్ లైసెన్సు తదితర ఇతర అవసరాల కోసం గుర్తింపుకార్డుగా కూడా వినియోగించుకోవచ్చు.

\- కర్నూలు కలెక్టరేట్

మా నెంబర్లు ఎవరిచ్చారబ్బా..?

పొలిటి'కాల్'



కోడుమూరు, ఏప్రిల్ 20: 'హలో.. నేను నారా చంద్రబాబునాయుడును మాట్లాడుతున్న మీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థికి ఓటేసి గెలిపించండి..' అని ఒక ఫోన్ కాల్. 'హలో నేను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని.. వైసీపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించండి..' అంటూ మరో ఫోన్ కాల్. ఇలా రాజకీయ నాయకులు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి ఎడతెగని ఫోన్ కాల్స్ వరుసగా ఓటర్లకు వస్తున్నాయి. ఇలా వరుస ఫోన్ కాల్స్ వస్తుండడంతో గ్రామీణ ఓటర్లు ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు. మా నెంబర్లు వాళ్లకు ఎవరు ఇచ్చారబ్బా అని ఆశ్చర్యపోతున్నారు. ఇలా మొబైల్ ఫోన్ల ద్వారా ప్రచారం జోరుగా సాగుతోంది. ఓటర్లకు కొత్త కొత్త నెంబర్ల నుంచి ఫోన్లు వస్తుండటం రాష్ట్రస్థాయి నాయకుల వాయిస్‌తో ఫోన్లు రావడం చర్చనీయాంశంగా మారింది. అవి ముందుగానే రికార్డ్ చేసిన కాల్స్ అని తెలిసిన వాళ్లు మాత్రం లైట్‌గా తీసుకొంటున్నారు. కానీ సాంకేతిక విషయాలు తెలియని గ్రామీణ ఓటర్లు మాత్రం తోటి వారితో నాకు చంద్రబాబునాయుడు, జగన్ నుంచి ఫోన్లు వస్తున్నాయని చెప్పుకొంటున్నారు. తమకు కూడా వస్తున్నాయని ఒకరితో ఒకరు చెప్పుకొంటున్నారు.

మైసూర్ బోండాలు వేసిన టీజీ భరత్



కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ శనివారం నగరంలో జొహరాపురంలో ప్రచారం చేపట్టారు. ఇందులోభాగంగా సెలూన్ షాపులోకి వెళ్లి కత్తెర చేతపట్టారు. అలాగే చిరు వ్యాపారి దుకాణంలోకి వెళ్లి ఓ మహిళ మైసూర్ బోండాలు వేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీని గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

\- కర్నూలు అర్బన్

వైసీపీ ఇచ్చిందేమి లేదు

● రామానాయుడు, రైతు పులకుర్తి



కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 20: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒరగబెట్టిందేమి లేదు. నాకు వారసత్వంగా ఐదు ఎకరాలు పొలం వచ్చింది. ఇందులో మూడు ఎకరాలు తరి పొలం ఉంది. దీంతో వైసీపీ ప్రభుత్వం గతంలో ఉన్న రేషన్ కార్డు తొలగించింది. బియ్యం రావడం లేదు. పిల్లలు గణేష్, చరణ్, నందిని చదువుకుంటున్నారు. రేషన్‌కార్డు లేకపోవడంతో అమ్మఒడి రాలేదు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఎలాంటి నిబంధనలు పెట్టలేదు. ఇపుడు సంక్షేమం మాట అటుంచితే.. నిత్యావసరాల ధరలు రెండింతలు పెంచారు. విద్యుత్ చార్జీల మోత సరేసరి. దీనికితోడు గ్యాస్ ధర మండుతోంది. పిల్లల ఫీజులు, పుస్తకాలు, తిండి గింజలు వగైరా అన్నింటి ధరలు పెరిగాయి. అంతేగాకుండా సేద్యం ఖర్చులు, ఎరువులు, పురుగుమందులకు పెట్టుబడి పెరిగింది. ఈ ఐదేళ్లలో సొంత పొలం ఐదు ఎకరాలకు తోడు మరో 8 ఎకరాలు కౌలు తీసుకుని ఉల్లి, మిరప, క్యాలీఫ్లవర్, టమోటా, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశాను. ఒక ఏడాది మాత్రం లాభం వచ్చింది. పంటలకు గిట్టుబాటు ధర అందలేదు. ఈ ఏడాది మిరపకు గిట్టుబాటు ధర లేక రూ.15 లక్షలు నష్టం వచ్చింది. ఐదేళ్లలో రూ.25 లక్షలకు పైగా అప్పు అయింది. తలచుకుంటే నిద్ర రావడం లేదు.

ఓటర్ వాయిస్

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేస్తా

● ఎం.కవిత, మిడ్తూరు



మిడ్తూరు, ఏప్రిల్ 20: ఈ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కు వినియోగించుకుంటాను. నందికొట్కూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపే నాయకుడికే పట్టం కడితే నియోజకవర్గం అభివృద్ధిలో ముందు వరుసలో నిలుస్తుంది. అభ్యర్థి చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. అతను గెలిస్తే మనకు అందుబాటులో ఉండి పనులు చేస్తాడా లేదా అని గమనించాలి. ఆపదలో ఉన్నపుడు మనకు అండగా నిలవాలి. ప్రజలు చైతన్యంతో ఓటు వేసినప్పుడే అభివృద్ధి జరుగుతుంది.

సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తన నియామవళి ఉల్లంఘనలు జరగకుండా ఎన్నికల సంఘం పక్కాగా ఏర్పాట్లు చేసింది. సాంకేతికతను జోడించి ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేయడమే కాకుండా పారదర్శకంగా జరిగేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా నామినేషన్ దాఖలు నుంచి ర్యాలీలు, ఎన్నికల ప్రచారానికి అనుమతులు తదితర వాటికి సంబంధించి సువిధ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు పరిశీలించి 48 గంటల్లో అనుమతులు జారీ చేస్తారు. అన్ని రకాల ప్రచార అనుమతులకు అభ్యర్థులు ముందుగా Www.suvidha. eci.gov.i n వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. సమావేశాలు, సభలు ర్యాలీలు ప్రచార వాహనాలు తాత్కాలికంగా పార్టీ కార్యాలయాల ఏర్పాటు ముఖ్య నేతల పర్యటనలకు హెలిప్యాడ్ ఏర్పాటు, ఇంటింటి ప్రచారం బ్యానర్లు, పార్టీ జెండాలు ఎయిర్‌బెలూన్లు, వీడియో వ్యాన్లు, కరపత్రాల పంపిణీ వంటి వాటి కోసం సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాల్సి ఉంటుంది.

డోన్ నుంచి ఏకైక మహిళా ఎమ్మెల్యే సుజాతమ్మ

చరిత్ర



డోన్, ఏప్రిల్ 20: రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన డోన్ గడ్డపై ఒకే ఒక మహిళ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మహిళా ఎమ్మెల్యేగా కోట్ల సుజాతమ్మ మాత్రమే ఇక్కడి నుంచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. డోన్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో కోట్ల సుజాతమ్మ మాత్రమే ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు 2004 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కోట్ల కుటుంబం నుంచి కోట్ల సుజాతమ్మ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బీ-ఫారం తీసుకుని నామినేషన్ రోజున డోన్‌లో కోట్ల సుజాతమ్మ అడుగు పెట్టారు. ఆ ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సుజాతమ్మ సంచలన విజయం సాధించారు. ఏకైక మహిళా ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ డోన్ అసెంబ్లీ చరిత్రపుటల్లో నిలిచిపోయారు.

రికార్డు బ్రేక్

- ఐదు సార్లు ఎమ్మెల్యే.. ఆరు సార్లు మంత్రి
- వరుసగా విజయాలు సాధించిన బీవీ మోహన్‌రెడ్డి



ఎమ్మిగనూరు, ఏప్రిల్ 20: చేనేతపురిగా పేరుగాంచిన ఎమ్మిగనూరు నియోజకవర్గం ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు వరుస విజయాలు సాధించిన ఏకైక నాయకుడు దివంగత బీవీ మోహన్‌రెడ్డి. ఎమ్మిగనూరు నియోజకవర్గం 1962లో ఆవిర్భవించింది. 1984లో ఎమ్మిగనూరు నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికతో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఎన్టీఆర్ ప్రియ శిష్యుడు బీవీ మోహన్‌రెడ్డి వరుసగా ఐదు సార్లు (1984(ఉప), 1985, 1989, 1994, 1999) విజయం సాధించారు. నియోజకవర్గంలోని ప్రధాన రాజకీయ వర్గాలైన కేఆర్, గౌడ, మాచాని, ఎర్రకోటలపై అలవోకగా విజయం సాధించి చరిత్ర తిరగ రాశారు. అంతేగాక ఎన్టీఆర్ మంత్రి వర్గం, చంద్రబాబునాయుడు మంత్రి వర్గంలోనూ మున్సిపల్, ఆర్అండ్‌బీ, రవాణా, భూగర్భ గనులు, సినీ ఆటోగ్రఫీ వంటి కీలక శాఖల మంత్రిగా పని చేశారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి దివంగత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, దివంగత దామోదరం సంజీవయ్య లాంటి నాయకులు సైతం ఒకటి రెండు సార్లు మినహా ఎక్కువ సార్లు గెలిచిన దాఖలాలు లేవు. బీవీ మాత్రం 1984లో రాజకీయ అరంగేట్రం చేసి వరుసగా ఐదు సార్లు గెలుపొంది నియోజకవర్గ చరిత్రలో తనకంటూ ఓ పేజీని పదిలం చేసుకున్నారు.

నామినేషన్ ప్రక్రియలో కీలక అంశాలు

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20: కేంద్ర ఎన్నికల సంఘం నామినేషన్ దాఖలుకు మార్గదర్శకాలు జారీ చేసింది. అభ్యర్థులు నామినేషన్ పత్రాలలో అడిగిన సమాచారాన్ని పూరించాలి. ఆస్తుల వివరాలు, నేర చరిత్ర, కేసులు ఇతర వివరాల సమాచారాన్ని జాగ్రత్తగా నింపాలి. పార్లమెంటు ఎన్నికలకు పోటీ చేసే వ్యక్తి భారతదేశ పౌరుడై ఉండాలి. అసెంబ్లీకి పోటీ చేసే వ్యక్తి రాష్ట్ర పౌరుడై ఉండాలి. ఎంపీ అభ్యర్థి దేశంలో ఎక్కడైనా పార్లమెంటు పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలి. పోటీ చేసే అభ్యర్థులకు కనీస వయస్సు 25 సంవత్సరాలు ఉండాలి. పార్లమెంటు అభ్యర్థులు ఫారం-2ఏ, అసెంబ్లీ అభ్యర్థులు ఫారం-2బీ నామినేషన్ పత్రాలు ఇవ్వాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. ప్రతి అభ్యర్థి నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చు. నేరుగా వచ్చి నామినేషన్లు వేయవచ్చు. లేదంటే ఆన్‌లైన్‌లో సువిధ పోర్టల్ ద్వారా కూడా నామినేషన్ దాఖలు చేయవచ్చు. అఫిడవిట్ ఫారం-26, ఓటరు కార్డు, రోల్ నెంబర్, కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. ఎంపీ అభ్యర్థులయితే.. రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.12,500లు చెల్లించాల్సి ఉంటుంది. ఎమ్మెల్యే అభ్యర్థులైతే రూ.10వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎస్సీలు ఎస్టీలు రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది.

● **వ్యయం :** శాసనసభకు పోటీ చేసే అభ్యర్థి రూ.40లక్షలు, పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు ఖర్చు చేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అంతకుమించి వ్యయమైతే.. ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుంది. అభ్యర్థులు తమ బ్యాంకు ఖాతా పాస్ పుస్తకాన్ని, పాన్‌కార్డు వివరాలను రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులు సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఒక ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. స్వతంత్ర అభ్యర్థులు మాత్రం పది మంది ఓటర్లు ప్రతిపాదించాలి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరుపున పోటీ చేసేటప్పుడు నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యేలోపు ఆయా రాజకీయ పార్టీలు ఏ, బీ ఫారంలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలి. అప్పుడే పార్టీ గుర్తు లభిస్తుంది. ఏ, బీ ఫారం ఇవ్వకుంటే ప్రతిపాదించిన ఓటర్ల సంఖ్య పది కంటే తక్కువ ఉంటే ఆ నామినేషన్ పరిశీలన తిరస్కరణకు గురవుతుంది. ప్రతిపాదించిన ఓటర్లు పది మంది ఉంటే ఇండిపెండెంట్ అభ్యర్థిగా గుర్తిస్తారు. అసెంబ్లీ, లేదా పార్లమెంటుకు పోటీ చేసే సమయంలో నామినేషన్ దాఖలు సమయంలో నోటరీ చేయించిన అఫిడవిట్ సమర్పించాలి. ఏ ఒక్క కాలం ఖాళీగా ఉంచినా రిటర్నింగ్ అధికారి నోటీసు ఇస్తారు. అప్పటికీ స్పందించి పూర్తి చేసే సరి లేదంటే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది.

● **నిబంధనలు ఇవి:** నామినేషన్ సమయంలో అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే లోపలికి అనుమతిస్తారు. నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల వరకు ఎవరినీ అనుమతించరు. మూడు వాహనాల వరకు మాత్రమే లోపలికి అనుమతిస్తారు. నియోజకవర్గ కేంద్రంలోని రిటర్నింగ్ అధికారి పని దినాల్లో మాత్రమే అభ్యర్థుల నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్ అందజేయడానికి వచ్చిన వాటి నుంచి అభ్యర్థి ఎన్నికల ప్రచార ఖర్చును లెక్కించనున్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదు.



పోలింగ్ డే.. హాలిడే..!

కాస్త ఉపశమనం



కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 20: భారత ఎన్నికల సంఘం,సాధారణ పరిపాలన శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 13న పోలింగ్ రోజు దుకాణాలు, సంస్థల్లో పని చేసే కార్మికులకు సెలవు ప్రకటిస్తున్నట్లు రాయలసీమ జోన్ కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎం.బాలునాయక్ శనివారం తెలిపారు. కార్మికులు తమ ఓటు హక్కుని వినియోగించుకునేందుకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వ్యాపారం, వాణిజ్యం, పారిశ్రామిక, ఇతర సంస్థలలో పని చేస్తున్న కార్మికులకు సెలవు రోజు వేతనాలు తగ్గించకుండ ఇవ్వాలని యజమానులకు ఆదేశాలు చేశారన్నారు. ఎవరైనా యజమాని సబ్‌సెక్షన్(1) సబ్ సెక్షన్(2) నిబంధనలకు ఉల్లంఘిస్తే అటువంటి యజమానులు జరిమానాతో శిక్షార్హులన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలోని కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.

ఆన్‌లైన్ వేదికలపై ఎన్నికల సంగ్రామం



కొత్త పుంతలు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 20: ఎన్నికల వేళ ఆన్‌లైన్ వేదికలపై ఎన్నికల సంగ్రామం జోరుగా సాగుతోంది. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఎక్స్(ట్విటర్), యూట్యూబ్ వేదికగా అధికార, విపక్షాలు ఓటరును చేరేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. నేతలంతా సామాజిక మాధ్యమాల్లో తిష్టవేశారు. పార్టీల అభ్యర్థులు, సోషల్ మీడియా అరంగేట్రంతో ఎన్నికల ప్రచారపర్వం కొత్త పుంతలు తొక్కుతుంది. యువ ఓటర్ నాడి పట్టేందుకు ఎన్నికల బరిలో నిలిచిన ఆయా పార్టీల అభ్యర్థులు సామాజిక ప్రసార మాధ్యమాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల వేడి రోజురోజుకు పెరుగుతుంది. అధికార తెలుగుదేశం, వైసీపీ అభ్యర్థులు ఒకరిపై ఒకరు మాటల తూటాలను ఎక్కుపెడుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ ఫాలోవర్లు, కార్యకర్తలు వాట్సాప్, ఫేస్‌బుక్‌లో ఓ రేంజ్‌లో హంగామా చేస్తున్నారు. వైసీపీ కూడా తెలుగుదేశం పార్టీతో దీటుగా హంగామా చేయడానికి ఆన్‌లైన్ వేదికలను ఉపయోగంచుకుంటోంది. ఈ సందర్భంలో తమ పార్టీల మేనిఫెస్టోలను అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తూ ఓటర్ల మనసును గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆన్‌లైన్ వేదికగా సవాళ్లు ప్రతి సవాళ్లతో తమ పోస్టుల ద్వారా ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

నేడు నంద్యాలకు వైఎస్ షర్మిల రాక

● నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



నంద్యాల టౌన్, ఏప్రిల్ 20: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం నంద్యాలకు వస్తున్నట్లు నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ తెలిపారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏపీ న్యాయయాత్ర పేరుతో వైఎస్ షర్మిల బస్సు యాత్ర నిరవహిస్తున్నారని చెప్పారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని బ్రాహ్మణ కొట్కూరు నుంచి సాయంత్ర 4 గంటలకు రోడ్ షో ప్రారంభమవుతుందని తెలిపారు. రోడ్ షో నందికొట్కూరులోని పటేల్ సెంటర్ వరకు చేరుకుంటుందని, అక్కడే బహిరంగ సభలో వైఎస్ షర్మిల ప్రసంగిస్తారని తెలిపారు. పటేల్ సెంటర్‌లో బహిరంగ సభ అనంతరం మిడుతూరు, గడివేముల మీదుగా నంద్యాలకు రాత్రి 7 గంటలకు చేరుకున్నట్లు తెలిపారు. శ్రీనివాససెంటర్ నుంచి గాంధీచౌక్ వరకు రోడ్‌షో, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. షర్మిల పర్యటనను జయప్రదం చేయాలని లక్ష్మీనరసింహ యాదవ్ పిలుపునిచ్చారు.

26న అమ్మవారి ఆర్జిత సేవలు నిలుపుదల

శ్రీశైలం, ఏప్రిల్ 20: శ్రీశైలం మహాక్షేత్రంలో ఈ నెల 26న భ్రమరాంబికాదేవి అమ్మవారికి వార్షిక కుంభోత్సవాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. అమ్మవారి ఆలయంలో నిర్వహించే అన్ని ఆర్జిత సేవలు, చండీహోమాన్ని కుంభోత్సవం రోజున నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవ సంబంధిత పూజలన్నీ అమ్మవారికి ఏకాంతంగా నిర్వహించనున్నారు. అయితే కుంభోత్సవం రోజున సాయంత్రం వేడుక తరువాత భక్తులకు రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు భ్రమరాంబికాదేవి అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. కుంభోత్సవం రోజున మధ్యాహ్నం వరకు మాత్రమే స్వామి సర్వదర్శనం, ఆర్జిత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు, సాయంత్రం నుంచి స్వామి సర్వదర్శనం, ఆర్జిత అభిషేకాలు నిలుపుదల చేస్తునట్లు తెలిపారు. అలాగే కుంభోత్సవం రోజున స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, ఏకాంత సేవను నిలివేస్తున్నట్లు అధికారులు చెప్పారు. దేవదాయ, ధర్మదాయ చట్టం ప్రకారం శ్రీశైలం క్షేత్రపరిధిలో పక్షి, జంతు బలులు, జీవహింస పూర్తిగా నిషేధమని, ఎవరైనా ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ఆత్మకూరు, ఏప్రిల్ 20: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఏప్రిల్ 14 నుంచి ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు స్థానిక ఫైర్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదాలను ఏ విధంగా నియంత్రించాలి, పాటించాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ భీముడునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల క్రైం: నంద్యాల జిల్లా కేంద్రంలోని విపత్తుల, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి ఎన్.జయన్న, నంద్యాల జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రసాదరావు, మెడికల్ ఆఫీసర్ లింగేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి బి.యోగేశ్వరరెడ్డి, నంద్యాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. ఏపీఎఫ్ఎస్ ఫిల్లింగ్ స్టేషన్ పంప్ బాయ్స్ కార్యక్రమంలో రక్తదానం చేసినట్లు అధికారులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 20: మద్యం తాగటానికి ఎవరూ డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంట్లో ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని 80బన్నూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కల్యాణ్(28) అనే వ్యక్తి ఏ పనిచేయకుండా మద్యానికి బానిస కావడంతో భార్య గిడ్డమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యం తాగివచ్చి అన్నదమ్ముళ్లతో నిత్యం గొడవపడటం, భార్య పుట్టింటి నుంచి రాకపోవడంతోపాటు మద్యం తాగడానికి ఎవరూ డబ్బులు ఇవ్వకపోవడంతో ఉరివేసుకున్నాడు. కల్యాణ్ భార్య గిడ్డమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మేరీజయంతి తెలిపారు. మృతునికి ఒక కుమారుడు ఉన్నట్లు చెప్పారు.

మాజీ ఎంపీపీ మహేశ్వరయ్య కన్నుమూత



ఆత్మకూరు, ఏప్రిల్ 20: మండలంలోని శ్రీపతిరావు పేట గ్రామానికి చెందిన ఆత్మకూరు మాజీ ఎంపీపీ మహేశ్వరయ్య అనారోగ్య కారణాలతో శనివారం కన్నుమూశారు. ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేస్తూ ఆత్మకూరులో స్థిరపడ్డారు. 2006-2011 వరకు ఆత్మకూరు ఎంపీపీగా పనిచేశారు. కొంతకాలంగా ఆయన క్యాన్సర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. కోలుకోలేక ఆయన శనివారం ఉదయం మృతిచెందారు. కాగా అంత్యక్రియలను ఆయన స్వగ్రామమైన శ్రీపతిరావు పేటలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ అధినేత జన్మదిన వేడుకల్లో నాయకులు
● కేక్ కట్ చేసి సంబరాలు





ఆత్మకూరులో 74 కేజీల కేక్‌ను కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా, టీడీపీలో చేరిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు తిరుపతయ్య



పగిడ్యాల: నెహ్రూనగర్‌లో..

ఆత్మకూరు, ఏప్రిల్ 20: చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ రాష్ట్రాన్ని అన్నివిధాలుగా నాశనం చేశారన్నారు. ప్రత్యేకించి సైకో జగన్ పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాలు అవస్థలు పడుతున్నాయని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబుతోనే రాష్ట్రాన్ని మేలు జరుగుతోందని వివరించారు. మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు కలీముల్లా, గౌస్‌లాజం, యూనస్, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు ఉన్నారు.

● ఆత్మకూరు పట్టణానికి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు తిరుపతయ్య, ఆయన కుమారుడు శివరామకృష్ణ శనివారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. అనంతరం వారి ఇంటి వద్దే టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని 74 కేజీల భారీ కేక్‌ను బుడ్డా కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, నాయకులు కొండలరావు, గిరిరాజు, శ్రీనివాసులు, మోతుల్లా, రవీంద్రనాయక్, వెన్నా శ్రీధర్‌రెడ్డి, అష్రఫ్ అలి తదితరులు ఉన్నారు. అలాగే ఆత్మకూరు పట్టణంలోని 2వ వార్డుకు చెందిన వైసీపీ బూత్ కన్వీనర్ మగ్బూల్, నాయకులు ముర్తుజావలి, వరాల గౌస్, హబీవుల్లా తదితరులు, వడ్లరామాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కేశవరెడ్డి, 7వ వార్డు సభ్యుడు గొల్ల శ్రీనివాసులు మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

శ్రీశైలం: శ్రీశైలంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కేకును కట్ చేసి వేడుకలు చేసుకున్నారు.

మహానంది: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో టీడీపీ నాయకులు గడ్డం నాగపుల్లయ్య, కంచెర్ల శివ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదినం పురష్కరించుకొని కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజు, మారెడ్డి సుబ్రమణ్యం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బిలకలగూడురు గ్రామంలో మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎస్‌ఏ రఫిక్, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, జయంత్‌రెడ్డి, ఫరూక్, వలిలు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు విశేష కృషి చేశారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు రూపొందించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకుడు ఫరూక్ బాషా ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకొన్నారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా గ్రామంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నాయకులు అన్నారు. నాగన్న, రవి చౌదరి, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, శివకుమార్ తదితరులు ఉన్నారు.



గడివేముల: బిలకలగూడూరులో..



మహానంది: బుక్కాపురంలో..



శ్రీశైలంలో..

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, ఏప్రిల్ 20: వెలుగోడు జడ్పీటీసీ అమిరున్‌బీ కుటుంబ సభ్యులు మసూద్ అహ్మద్, చాంద్‌బాషా, షహీన్‌షాతో పాటు మరి కొందరు ఆకుల కృష్ణ, మల్లికార్జున, రామాయణ, రమేష్, పోతు సుబ్బయ్యలతో పాటు మరో 5 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అలాగే వెలుగోడు పట్టణంలోని నీరుకట్టు వీధికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారపు శేషి రెడ్డి, మాజి సర్పంచ్ కలాం, పట్టణ అధ్యక్షులు ఖలీల్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ ఎల్లా కృష్ణుడు, సూర్యనారాయణ, తెలుగ చిన్నోడు, ఆకుల గిరిబాబు, మద్దూరు శీను ఆధ్వర్యంలో చేరారు.

23న మైనార్టీల సమావేశం

శ్రీశైల నియోజకవర్గ మైనార్టీల సమావేశం ఈనెల 23న ఆత్మకూరులో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. సమావేశం ఏర్పాట్లపై శనివారం టీడీపీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహంచారు. అలాగే చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. శిరివెళ్ల రజాక్, అన్నారపు శేషిరెడ్డి, బండ్ల శంకర్‌రెడ్డి, కలాం, జాకీర్ హుసేన్, ఖలీల్, రసూల్, రామానాయుడు, జనసేన నాయకులు షాలు బాషా పాల్గొన్నారు.

'వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 20: ప్రజలు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. శనివారం బైర్లూటి పీహెచ్‌సీ పరిధిలోని నల్లకాలువ గ్రామంలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరావు ఆదేశాల మేరకు పైలేరియా వ్యాధిగ్రస్థులకు పైలేరియా కిట్లను పంపిణి చేశారు. సీహెచ్‌వో శివకుమార్, ఆరోగ్య కార్యకర్త భాష్కర్ వీరాపో తరతరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

● నంద్యాల అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 20: టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని నంద్యాల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. పట్టణంలోని క్రాంతినగర్‌లో వైసీపీ నాయకుడు కొండబోయిన శ్రీనివాసులుయాదవ్‌తో పాటు 145 కుటుంబాలు శనివారం ఫరూక్ సమక్షంలో టీడీపీలో చేరాయి. అలాగే 33వ వార్డుకు చెందిన 50 కుటుంబాలు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయ వాది వెదుర్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. చాబోలులో గ్రామ టీడీపీ నాయకుడు ఇలియాస్ ఆధ్వర్యంలో 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. 26, 27 వార్డు నుంచి వైసీపీ నాయకుడు ముత్యాల ప్రభాకర్‌తో పాటు 200 కుటుంబాలు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, 27వ వార్డు టీడీపీ కౌన్సిలర్ జైనాబీ ఆధ్వర్యంలో ఫరూక్ సమక్షంలో చేరారు. ఫరూక్ మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి, మాజీ కౌన్సిలర్ శివశంకర్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.


'టీడీపీతోనే ప్రజా సంక్షేమం'



మాండ్ర లింగారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 20: టీడీపీతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు మాండ్ర లింగారెడ్డి అన్నారు. మండలంలోని కొణిదేల గ్రామంలో శనివారం లింగారెడ్డి సమక్షంలో టీడీపీ నందికొట్కూరు మండల మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో కొణిదేల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వీరికి లింగారెడ్డి కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనివాసులు, రాకేష్, లక్ష్మన్న, యుగందర్, శేఖర్, జయచంద్ర, డేవిడ్ తదితరులు ఉన్నారు. లింగారెడ్డి మాట్లాడుతూ టీడీపీని గెలిపించుకుంటేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిల్పా.. నోరు అదుపులో పెట్టుకో: ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ యశస్వినిరెడ్డి

మహానంది, ఏప్రిల్ 20: ఎమ్మెల్యే శిల్పాకు తమ గురించే మాట్లాడే అర్హత లేదని, నోరు అదుపులో పెట్టుకోవాలని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం సీతారామపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రవర్తన నచ్చకనే తాను, తన సోదరి సీతారామపురం సర్పంచ్ తేజస్వినిరెడ్డి, తండ్రితో పాటు వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు తెలిపారు. రౌడీషీటర్లు, నాటుసారా కాసే గుండాలను పార్టీలో చేర్చుకొనే ఎమ్మెల్యే శిల్పాకు తమ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. మహానందిలో గోశాల కోసం దాతలు ఇచ్చిన రూ.20 లక్షలను తన వద్ద పెట్టుకొని మహానందీశ్వరుడికే శఠగోపం పెట్టారన్నారు. ఎంపీపీ పదవి కోసం రూ.50 లక్షలు శిల్పా డిమాండ్ చేశారని ఆరోపించారు. తాము కబ్జాలు చేస్తుంటే ఎమ్మెల్యేగా చూస్తు కూర్చున్నారా? అని మండిపడ్డారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఇవే చివరి ఎన్నికలు అని అన్నారు. సీతారామపురం సర్పంచ్ తేజస్వినిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త రామలింగారెడ్డి, నాయకులు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

23న వీరాపురంలో బండలాగుడు పోటీలు

కొత్తపల్లి, ఏప్రిల్ 20: వీరాపురం గ్రామంలో సుంకులా పరమేశ్వరి దేవి అమ్మవారి జయంతి సందర్భంగా ఈ నెల 23న ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు మల్లెల బ్రదర్స్, వీరాపురం గ్రామ ప్రజలు తెలిపారు. శనివారం మల్లెల బ్రదర్స్ మాట్లాడుతూ అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా ఆరు పళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి ఆరు బహుమతులు వరుసగా రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 23వతేదీ ఉదయం 7 గంటలోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేరును నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఆరుపళ్ల సైజులో ఉన్న ఎద్దులు మాత్రమే పాల్గొనాలన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైసీపీ పాలనలో ప్రజల అవస్థలు: మాండ్ర



నాగలూటి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాండ్ర

మిడుతూరు, ఏప్రిల్ 20: ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడ్డారని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి అన్నారు. మండలంలోని నాగలూటి గ్రామంలో శనివారం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాండ్ర మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని అన్నారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. గుండం రమణారెడ్డి, మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, రవీంద్రబాబు, బాబుసాహెబ్, సర్వోత్తమరెడ్డి, శివరామిరెడ్డి, రంగా రెడ్డి, రామలింగేశ్వర రెడ్డి, కృష్ణ, రామకృష్ణ, వెంకట్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రవికాంత్ రెడ్డి, తిమ్మా రెడ్డి, రవికుమార్, సంపత్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

● నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య



ప్రచారం చేస్తున్న జయసూర్య, నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 20: వైసీపీ నిర్లక్ష్యం వల్ల నందికొట్కూరు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నందికొట్కూరుకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. శనివారం టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య నందికొట్కూరులోని 21వ వార్డులో ఇంటింటికి ప్రచారం చేశారు. తన భర్త చనిపోయి చాలా కాలం అవుతున్నా.. అధికారులు పింఛన్ ఇవ్వడం లేదని, పింఛన్ ఇప్పించాలని రాజా వీధికి చెందిన శశికళ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్యను కోరారు. పూర్తి సమాచారం తెలుసుకున్న జయసూర్య పింఛన్ వచ్చే విధంగా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. మద్దిలేటి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, కృష్ణారెడ్డి, ముర్తుజావళి, షకీల్ అహ్మద్, జాకీర్, లింగమయ్య, ఏసేపు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మమేకం

సామాన్య కార్యకర్తలతో జయసూర్య మమేకమయ్యారు. నందికొట్కూరు పట్టణంలో ఉదయం నుంచి ప్రచారంలో బిజీగా ఉన్న కార్యకర్తలు, అభ్యర్థి ప్రచారం ముగిసిన అనంతరం కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రచారం ఎలా జరుగుతోంది? ఇంకా ఎవరెవరిని కలవాలంటూ కార్యకర్తలతో మాటమంతి నిర్వహించారు.

మూడో రోజు నామినేషన్లు

ఆత్మకూరు, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలకు మూడో రోజైన శనివారం ఒక నామినేషన్ దాఖలైనట్లు ఆర్వో సుధారాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. వైసీపీ అభ్యర్థిగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి నామినేషన్ పత్రాలను సమర్పించినట్లు చెప్పారు.

నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి నామినేషన్‌ను శనివారం దాఖలు చేశారు. ఆయన వెంట తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్‌నాయుడు, తదితరులు ఉన్నారు.

'మోమిన్ జిలానీ సేవలు చిరస్మరణీయం'

ఆత్మకూరు, ఏప్రిల్ 20: ఆత్మకూరు పట్టణానికి దివంగత మాజీ సర్పంచ్ మోమిన్ జిలానీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన తనయుడు మునీర్‌బాషా అన్నారు. శనివారం మోమిన్ జిలానీ 14వ వర్థంతిని పురస్కరించుకుని ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామ శివార్లలోని ఎస్ఆర్‌బీసీ మానవతా వృద్ధాశ్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. మన్సూర్ అలి, మోమిన్ హుసేన్, ఖలీలుల్లా, ఖాదర్ బాషా, సలావుద్దీన్ ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు

ఆత్మకూరు, ఏప్రిల్ 20: ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో గత మార్చి నెలలో ఉత్తమంగా రాణించిన ఆర్టీసీ ఉద్యోగులకు శనివారం ఆర్టీసీ ఉన్నతాధికారులు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఎం మహేంద్రుడు మాట్లాడుతూ.. మార్చి-2024కు సంబంధించి కడప జోన్ పరిధిలో 79ఓఆర్ సాధించి డిపోను ప్రథమ స్థానంలో నిలుపడమే కాకుండా 5.49 కేఎంపీఎల్‌తో ఇంధనాన్ని పొదుపు చేసి జిల్లాలోనే తమ డిపో కార్మికులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు.

పలు మండలాల్లో వర్షం

పాములపాడు, ఏప్రిల్ 20: మండు వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతూ ఎండలు మండిపోతున్న వేళ వర్షం కురువడంతో ప్రజలు వేసవి తాపం నుంచి కాస్త ఉపశమనం పొందారు శనివారం పాములపాడు, రుద్రవరం, చెలిమిళ్ళ, లింగాల, మిట్టకందాల తదితర గ్రామాల్లో మధ్యహ్నం మూడు గంటల ప్రాంతంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. పాములపాడులో దాదాపు 40 నిమిషాలు వర్షం కురియడంతో కేజీ రోడ్డుపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు కాస్త ఇబ్బంది పడ్డారు.

జూపాడుబంగ్లా: ఉదయం నుంచి సూర్యుడు భగభగ మండుతూ సాయంత్రం 4గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కొద్దిగా వాతావరణం చల్లబడింది.

కొత్తపల్లి: మండలంలో వర్షం కురిసింది. శనివారం సాయంత్రం మండలంలోని గువ్వలకుంట్ల, శివపురం, సింగరాపల్లి, బావాపురం, నందికుంట, దుద్యాల తదితర గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉక్కపోతతో మధ్యాహ్న వేళలో ఎండ వేడిమి తాళలేక వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడిన నేపథ్యంలో వాతావరణంలో మార్పుల కారణంగా ఉన్న ఫలంగా వర్షం కురిసింది.

వలంటీర్లు రాజీనామా

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 20: మండలంలోని 29 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలు ఇన్‌చార్జి ఎంపీడీవో నూర్జహాన్‌కు అందజేశారు. అందులో పారుమంచాలకు చెందిన 16, మండ్లెం-1 పరిధిలో 8, 80బన్నూరులో 5మంది రాజీనామా చేసినట్లు చెప్పారు. అందులో పారుమంచాలకు చెందిన నలుగురు ప్రభుత్వానికి సంబంధించిన ఫోన్లు ఇవ్వకపోవడంతో వారి రాజీనామాను తిరస్కరించినట్లు ఆమె తెలిపారు.

పగిడ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో 27 మంది వలంటీర్లులు శనివారం రాజీనామలు చేసినట్లు ఎంపీడీవో కవిరాజ్ తెలిపారు. లక్ష్మాపురం-2 సచివాలయంలో 19 మంది, నెహ్రూనగర్ 1, 2 సచివాలయాలలో ఏడుగురు, పగిడ్యాల సచివాలయంలో ఒకరు రాజీనామా రాజీనామా పత్రాలను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అందజేసినట్లు తెలిపారు.

పాములపాడు: ఇస్కాల గ్రామంలో 13 మంది వలంటీర్లు శనివారం ఎంపీడీవో సరస్వతికి రాజీనామా పత్రాలు అందచేశారు తమ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు చెప్పారని ఎంపీడీవో తెలిపారు..

మిడుతూరు: నాగలూటి, తలముడిపి, మిడుతూరు 1, మిడూతూరు2, దేవనూరు గ్రామాలకు చెందిన 31 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో గంగావతి తెలిపారు. ఈ రాజీనామాలు వ్యక్తిగత కారణాలతో చేస్తున్నట్లు చెప్పారని ఆమె తెలిపారు.

ఉద్యానవనాల పరిశీలన



ఉద్యానవనాన్ని పరిశీలిస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, ఏప్రిల్ 20: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణశాల, ఉద్యానవనాలను శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ అధిక ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గోవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఉద్యాన వనాలను పరి శీలించి ఎండల కారణంగా క్షేత్ర పరిధిలోని మొక్కలు, ఉద్యానవనాలు ఎండిపోకుండా నిరంతరం మొక్కలకు నీటిని అందించి సంరక్షించాలన్నారు. అలాగే ఉద్యానవనాలలో పనిచేసే సిబ్బందికి దేవస్థానం తరపున టోపీలను అందజేయాలని, సిబ్బంది సౌకర్యార్థం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరచడానికి జనం సిద్ధం

బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 20: వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరచడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బనగానపల్లె నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం 11.15 గంటల ప్రాంతంలో తన కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. బనగానపల్లె తహసీల్దారు కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కామేశ్వరావు సమక్షంలో ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు చేసిన కార్యక్రమంలో ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, కుమారుడు బీసీ మనోహర్‌రెడ్డి, కుమార్తెలు మనోరమ, మహాలక్ష్మి, అల్లుళ్లు రమణారెడ్డి, పుష్కిన్‌రెడ్డితోపాటు ఆయన సోదరులు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి ఉన్నారు. నామినేషన్ అనంతరం బీసీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ, వాల్మీకి సంఘం నాయకులు

మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో విధ్వంస పాలన కొనసాగించిందన్నారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బనగానపల్లె నియోజ కవర్గ ప్రజలు వైసీపీని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్ర మంలో కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగలపరమేశ్వరరెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

130 కుటుంబాలు టీడీపీలో చేరిక : బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీలో జోష్ పెరిగింది. ఒక్క రోజు వైసీపీని వీడి 130 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో శనివారం చేరాయి. సంజామలకు చెందిన వంద వైసీపీ కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి. సంజామలలో వైసీపీని వీడి కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోని ఆహ్వానించారు. అలాగే కొలిమిగుండ్లకు చెందిన 30 వాల్మీకి కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. తలారి రామ్మోహన్, శ్రీను, నరేష్, పొట్టిపాటి శివ తదితరులు టీడీపీ కార్యాలయంలో బీసీ సమక్షంలో టీడీపీలో చేరారు.

వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం: బీసీ

వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని టీడీపీ బనగానపల్లె అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలో ప్రజాగళం కార్యక్ర మం నిర్వహించారు. పట్టణంలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటిం చిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపో యారు. బనగానపల్లె పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్న స్థితిలో ఉందని, కాల్వలను కూడా శుభ్రపరచడం లేదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంద పనిదినాలు కల్పిస్తాం: పీడీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ రామచంద్రారెడ్డి

రుద్రవరం, ఏప్రిల్ 20: చంటిబిడ్డల తల్లులకు, 55ఏళ్లు దాటిన వారికి మళ్లీ వంద పనిదినాలు కల్పిస్తామని ఉపాధి హామీ పథకం పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం రుద్రవరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేశారు. కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీడీ మాట్లాడుతూ ఉదయం 6.30 నుంచి 10.30 వరకు పనులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా 16 మండలాలను కరువు ప్రాంతాలుగా ఎంపిక చేశారని తెలిపారు. ప్రతి మండలంలో ఐదువేల మందికి ఉపాధి పని కల్పించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 90 వేల మంది ఉపాధి కూలీ పనులకు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ సుబ్బన్న, పీఏలు నాగేంద్ర, సురేష్ ఉన్నారు.

'టీడీపీతోనే పేదల సంక్షేమం'

చాగలమర్రి, ఏప్రిల్ 20: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ మహిళా నాయకురాలు కిరణ్మయి అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని గాంధీ బజార్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. అన్సర్‌బాషా, నరసింహులు, షరీఫ్ ఉన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



బనగానపల్లె, డోన్‌లో కేక్ కట్ చేసి చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 20: పట్టణంలోని పాతరైస్ మిల్ ఏరియాలో చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే విజనరీ లీడర్ చంద్రబాబు అని, నవ్యాంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పరుగులు పెట్టించిన నాయకుడు అని కొనియాడారు.

డోన్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి పార్టీ నాయ కులకు, కార్యకర్తలకు డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్ర కాష్‌రెడ్డి పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, రాంబాబు రెడ్డి, ఎస్ఎండీ రఫీ, ఓంప్రకాష్, రంజిత్ కిరణ్, గోవిందు, వలసల బాలుడు, బీజేపీ నాయకుడు మహారాజ్, ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల రూరల్: స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదినాన్ని పుర స్కరించుకొని మం డల టీడీపీ అధ్యక్షు డు మూలే రామే శ్వరరెడ్డి ఆధ్వర్యం లో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీఆర్ లక్ష్మీరెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి, హుస్సేన్ రెడ్డి, శివరామి రెడ్డి పాల్గొన్నారు.


బేతంచెర్లలో..

ప్యాపిలి: స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, టి.శ్రీనివాసులు, రామ్మోహన్ యాదవ్, రాజా నారాయణ మూర్తి, అంకిరెడ్డి, ఖాజావీర్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం టీడీపీ కార్యాల యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, మైనార్టీ నాయకుడు జాకీరుల్లా బేగ్, రవీంద్ర నాయక్, మాధవిరెడ్డి, జక్రియాఖాన్, రంగాపురం టీడీపీ నాయకులు రామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు, లొడ్డ శేఖర్, నల్లారెడ్డి పాల్గొన్నారు.

శిరివెళ్ల: శిరివెళ్లలో టీడీపీ నాయకులు బలిజపేట వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సూరా రామ, వెంకట సుబ్బయ్య, పెద్దరాయుడు, సుబ్బరాయుడు, నవిన్, శ్రీనివాసులు, రసూల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు పక్కిరెడ్డి, సంజీవరెడ్డి, రామమోహన్, శ్రీనివాసులు, వి.రాజు, రమణ, రాజన్న, జీవన్, గాబ్రెల్ తదితరులు పాల్గొన్నారు.


శిరివెళ్లలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


చాగలమర్రి మండలం తోడేండ్లపల్లెలో..


ప్యాపిలిలో..


కొలిమిగుండ్లలో..

పట్టువస్త్రాల సమర్పణ


తమిళనాడు రాణిపేట శ్రీషోలింగుర్ అమృతఫలవల్లి యోగనరసింహస్వామికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న అహోబిలం వేదపండితులు

నంద్యాల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట జిల్లాలోని శ్రీషోలింగుర్ అమృతఫల వల్లి సమేత యోగనరసింహస్వామికి పట్టువస్త్రాలను అహోబిలం వేదపడింతులు శనివారం సమర్పించారు. ఇటీవల అహోబి లం లక్ష్మీనరసింమస్వామికి జరిగిన బ్రహ్మోత్సవాలలో విశేషమైన గరుడ సేవ సందర్భంగా పీఠాధిపతి రంగనాథ యతీంద్రమహాదేశికన్ ఆదేశాల మేరకు సమర్పించారు.

'వైసీపీకి గుణపాఠం తప్పదు'

చాగలమర్రి, ఏప్రిల్ 20: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని టీడీపీ నాయకుడు జెట్టి నాగరాజు అన్నారు. శనివారం న్యూబిల్డింగ్స్ వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఖాదర్, జెట్టిప్రసాద్, సురేష్, దస్తగిరి, వెంకటయ్య, గాంధీ, బాషా, ప్రకాష్ పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి': చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, బీసీ సంఘం మాజీ అధ్యక్షుడు రామతీర్థం అన్నారు. శనివారం చాగలమర్రి కుమ్మరి వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

'గాలివానతో విద్యుత్ శాఖకు రూ.5 లక్షల నష్టం'

రుద్రవరం, ఏప్రిల్ 20: రుద్రవరం మండలంలో శుక్రవారం రాత్రి వీచిన గాలి వానకు విద్యుత్ స్తంభాలు నేలకూలి, తీగలు తెగిపోవడంతో రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు డిప్యూటీ డీఈ రవికాంత్ చౌదరి, ఏఈ రాఘవేంద్రారెడ్డి శనివారం తెలిపారు. కొట్టాల, శ్రీరంగాపురం, బీరవోలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

విద్యార్థినులకు లాక్ యాక్‌పై అవగాహన

చాగలమర్రి, ఏప్రిల్ 20: చాగలమర్రి గ్రామంలోని బాలికోన్నత పాఠశాలలో లాక్ యాప్‌పై ఎంఈవో అనూరాధ శనివారం అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లలో ఈ లాక్ నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. బాలుర ఉన్నత పాఠశాలకు రూ.8 లక్షలు, బాలికల పాఠశాలకు రూ.7.50 లక్షలు, మద్దూరు పాఠశాలకు రూ.8లక్షలు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. హెచ్ఎం విజయలక్ష్మి, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

చాగలమర్రి, ఏప్రిల్ 20: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు బాలదస్తగిరి అన్నారు. శనివారం మండలంలోని నగల్లపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివదస్తగిరి, నాగరాజు, బాల ఓబులేసు ఉన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

చాగలమర్రి, ఏప్రిల్ 20: చాగలమర్రి గ్రామంలోని 3వ రైతు భరోసా కేంద్రాన్ని ఏవో రంగనేతాజీ శనివారం తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2022 ఖరీఫ్‌లో పంట బీమా చేయని 13 మంది రైతులతో తిరిగి బీమా కోసం నమోదు చేస్తున్నామని ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వీఏఏ సుబ్బరాయుడు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన: చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో న్యామతుల్ల పరిశీలించారు. నాణ్యతగల కోడిగుడ్లు, భోజనం పంపిణీ చేయాలని అన్నారు. అనంతరం లాజిక్ యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం కోటయ్య ఉన్నారు.

మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి

డోన్(రూరల్), ఏప్రిల్ 20: ప్రమాదాల నివారణకు మహిళలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం అన్నారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు, సూపర్‌వైజర్లకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సీడీపీవో హాజరై మాట్లాడుతూ వంట గదిలో గ్యాస్ వినియోగిం చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి రంగస్వామి గౌడు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.20వేల కోసం మహిళను బలి తీసుకుంటారా?

డోన్, ఏప్రిల్ 20: మంత్రి బుగ్గన సిబ్బంది రూ.20వేల కోసం బెదిరింపులు చేసి పేద కుటుంబానికి చెందిన మహిళ ప్రాణాన్ని బలి తీసుకోవడం దారుణమని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాదులోని ఫిల్మ్‌నగర్ రోడ్డులో మంత్రి బుగ్గన వాహనానికి పొరపాటున ఓ బాలుడు స్కూటర్ తగిలిస్తే.. చిన్న గీతలు పడితే రూ.20వేలు కట్టాలని బాలుని కుటుంబానికి బెదిరింపులు చేయడం సిగ్గు చేటన్నారు. బుగ్గన అనుచరుల వేధింపులు తట్టుకోలేక సూర్యకుమారి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, తిమ్మయ్య యాదవ్, మల్లికార్జున పాల్గొన్నారు.

కోట్లను కలిసిన కేఈ జయన్న: డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా మాజీ జడ్పీటీసీ కేఈ జయన్న, ఆయన తనయుడు కేఈ వేణుబాబు కలిశారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల కేఈ జయన్నతో చర్చించారు.

ప్యాపిలి: మండలంలోని జలదుర్గం గ్రామంలో వ్యవసాయ భూములను, తోటలను డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి శనివారం పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మురళీ క్రిష్ణగౌడు, గండికోట రామసుబ్బయ్య పాల్గొన్నారు.

'ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలి'

నంద్యాల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని జనసేన పార్టీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి పిలుపునిచ్చారు. రుద్రవరం మండలం పెద్దకంబలూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకు లు ఆ పార్టీని వీడి ఆళ్లగడ్డ పట్టణంలో శనివారం జనసేనలో చేరారు. వారికి జనసేన కండువ కప్పి రాంపుల్లారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఇరిగెల సోదరులు పాల్గొన్నారు.

కోట్ల తరపున నామినేషన్ దాఖలు

డోన్, ఏప్రిల్ 20: డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తరపున శనివారం టీడీపీ నాయకులు ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణ యాదవ్, సీనియర్ న్యాయవాది శ్రీనివాస భట్, దస్తగిరి, బీజేపీ నాయకులు వడ్డె మహా రాజ్, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి టీడీపీ కూటమి అభ్యర్థి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డికి అందజేశారు.

బనగానపల్లెకు తరలిన టీడీపీ నాయకులు

డోన్, ఏప్రిల్ 20: బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి డోన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు శనివారం తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, ధర్మవరం భరత్ రెడ్డి తరలివెళ్లారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి

బేతంచెర్ల, ఏప్రిల్ 20: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని డోన్ యువ నాయకురాలు కోట్ల నివేదిత అన్నారు. శనివారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

23 నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



బేతంచెర్ల, ఏప్రిల్ 20: పట్టణంలోని గౌరిపేట ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు గ్రూపు దేవాలయాల ఈవో మద్దిలేటి శనివారం తెలిపారు. 22న ఉదయం పుణ్యాహావాచనం, రుత్విగర్వణం, కలశస్థాపన, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 23న ఉదయం శ్రీవారి కళ్యాణోత్సవం, సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందన్నారు 24న గరుడ వాహనం, 25న శేష వాహనం, 26న గజవాహనం, 27న సింహ వాహనంపై ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. 28న పూర్ణాహుతి, సాయంత్రం పారువేట నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 28 వరకు అఖండ శ్రీరామ సప్తాహం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఈ నెల 28న పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మద్దిలేటి తెలిపారు. పోటీల విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ.6.70 లక్షలు

బేతంచెర్ల, ఏప్రిల్ 20: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.6.70 లక్షలు సమకూరినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారా మచంద్రుడు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మ వార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.6,7 0,791లు దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

'ఎన్నికల నియమావళి పాటించాలి'

రుద్రవరం, ఏప్రిల్ 20: ఎన్నికల నియామావళిని తప్పకుండా పాటించాలని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకంబలూరులో శనివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. రాబోయే ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు పాటించాలన్నారు.

కాంగ్రెస్ జెండాలు, టోపీల స్వాధీనం

చాగలమర్రి, ఏప్రిల్ 20: చాగలమర్రి టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో పోలీసుల తనిఖీలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన జెండాలు, టోపీలు, ఇతర సామగ్రి ఆటోలో శనివారం రాత్రి తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. కడప జిల్లా వైపు నుంచి కర్నూలు వైపు తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనుమతి పత్రాలు చూపిస్తే వదిలిపెడతామని ఎస్ఐ తెలిపారు.

'లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి'

నంద్యాల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల మే 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయాధికారి మురళీకృష్ణ చెప్పారు. ఆళ్లగడ్డ కోర్టు ఆవరణలో శనివారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ప్రవేశపెట్టే కేసులను సేకరించాలని సూచించారు.

ఘనంగా బిజ్జం సత్యంరెడ్డి వర్ధంతి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 20: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డి కార్యాలయంలో దివంగత టీడీపీ నేత బిజ్జం సత్యంరెడ్డి వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు మారం భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో బిజ్జం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గుంజలపాడు మల్లికార్జునరెడ్డి, శివవరం వెంకటేశ్వరరెడ్డి, సైమన్ పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

బనగానపల్లె, ఏప్రిల్ 20: వ్యవసాయంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే కోర్డినేట్ ధనలక్ష్మి అన్నారు. శనివారం రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ రైతులు అధిక ఉత్పత్తి కోసం తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి సాధించేందుకు రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. వర్షాధార వ్యవసాయంలో చేపట్టాల్సిన నేల, నీటి యాజమాన్య పద్ధతులను నీటికుంటల నిర్వహణ గురించి వివరించారు. శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, ఆదినారాయణ, రవిగౌడ్, లక్ష్మిప్రియ, నందికొట్కూరు, డోన్ మండలాల రైతులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బనగానపల్లె, ఏప్రిల్ 20: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామ సమీపంలోని వేపచెట్ల కింద పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 31,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు తెలిపారు. తమకు అందిన సమాచారంతో పోలీస్ సిబ్బందితో దాడులు చేసి 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘర్షణ.. ఇద్దరిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని చింతలాయపల్లెలో చిన్న పిల్లల విషయంలో ఇద్దరు ఘర్షణ పడటంతో వారిపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. చింతలాయపల్లె గ్రామానికి చెందిన రామక్రిష్ణ తన కుమారుడిని హరి కొడుకు కొట్టాడని, అడగడానికి వెళ్లగా హరి, శీను అనే వ్యక్తులు దాడిచేసి కొట్టారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

టీడీపీలో చేరిక

దొర్నిపాడు, ఏప్రిల్ 20: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన తిమ్మయ్య, నాగన్న, యేసు, సిద్ధు, లక్ష్మయ్య, దసరయ్యతోపాటు మరో 70 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి మాజీ మంత్రి, ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అఖిలప్రియ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బాబు, సిద్ధి సత్యం పాల్గొన్నారు.